
# మెరీనా...ఓ మెరీనా...

అనామకుడు

అదే సముద్రం..అదే ఆకాశం...అదేఇసుక. ఐతే అంతా కొత్తగా ఉంది. ఏదో పెద్ద మార్పొచ్చికాదు.అసలుమార్పురాడానికి,సముద్రం, ఆకాశం, ఇసుకా ఏం మారిపోతాయి?

బీచ్ కూడ ఈ ఇరవై ఏళ్ళలోనూ పెద్దగా మారి పోలేదు. ఐనా నాకు కొత్తగా కనిపిస్తోంది.

సాయంత్రం అయిదయిందంటే చాలు-బీచ్‌కి వచ్చి వాలిపోయేవాళ్ళం-నేనూ, సుందర్, శ్రీరాం, ప్రకాష్.ఒక్కొక్కరిదీ ఒక్కో కుటుంబ వాతావరణం-ఒక్కో చదువూ-ఒక్కో ఆర్థిక పరిస్థితీ- ఐతే అవన్నీ




# అనిల్ అవార్డ్ రూ.5000 బహుమతి పొందిన కథ

అడ్డంగా ఉండేవికావు.అసలు వాటి గురించి ఆలోచనే ఉండేది కాదు.హాయిగా, జాలీగా, ఆనందంగా, అందమైన సముద్రతీరంలో మేం.

మేం మాత్రమే లోకంలో ఉన్నట్లుగా- అక్కడకి వచ్చే తక్కినవాళ్ళమీద జోక్స్‌వేసుకుంటూ-కబుర్లు చెప్పుకుంటూ, కలలు కంటూ-డబ్బెవరిదన్న ప్రసక్తి లేకుండా ఐస్క్రీములూ, మామిడికాయలూ, మురుకులూ తింటూ- అలల్లో నించుంటూ, ఇసుకలో పరుగెడుతూ, పడవల్లో కూర్చుంటూ-

ఒకటీ రెండూ రోజులు కావు- సంవత్సరాలు.



కాలేజీలో చదువుకున్నంత కాలం ఈ మెరీనా తీరం మాకు సాయంకాలాల ఆలవాలం అయిపోయింది.రోజూవచ్చేవాళ్ళం. వానాకాలంలో కూడా గొడుగు వేసుకుని వచ్చేవాళ్ళం. ఒక్కోసారి సముద్ర తీరం మొత్తానికి మేం నలుగురం ఉండే వాళ్ళం. అదే మెరీనా తీరానికి ఇరవై ఏళ్ళ తర్వాత వచ్చి చూస్తే అంతా కొత్తగా కనిపిస్తోంది.

కూచున్న మనుషులూ, అమ్ముకునే కుర్రాళ్ళూ, ఆఖరికి అడుక్కునేవాళ్ళూ- అంతా కొత్తే. 'అమెరికా నుండి వస్తున్నాను-ఆదివారం సాయంత్రం నలుగురం మళ్ళీ సముద్రతీరంలో కలుద్దాం' అని ముగ్గురికీ మెయిల్స్ రాస్తే-

శ్రీరాం 'బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళాలి- రాలేకపోతున్నాను' అని రాసేశాడు. ప్రకాష్ 'అర్జంట్ పనిఉంది రాలేనేమో -ఐనా చూస్తాను' అని రాశాడు. సుందర్ వీలుచేసుకుని వస్తానని రాశాడు.

అందరూ సంసారాల్లో ఇరుక్కుపోయారు. బాధ్యతలూ, బంధువులూ, బంధాలూ. నేనూ, నా భార్యా ఈ చట్రంలో ఇరుక్కుపోలేదు. అందుకే స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ కాలం గడిపేస్తున్నాను.

బీచుల్లో, కేసినోల్లో, నైట్ క్లబ్బుల్లో- మందుల్లో, విందుల్లో,అమ్మాయిలతో విలాసంగా సాగిపోతోంది జీవితం. ఎప్పుడు ఎక్కడకి కావాలంటే అక్కడకి వెళ్ళడం, ఏం కావాలంటే అది చెయ్యడం.

మేం నలుగురం సామాన్యంగా కూచునే చోటు- అది ఓ పడవచాటు- అక్కడకెళ్ళి కూచున్నాను.అక్కడకివచ్చేజంటలని చూసి వాళ్ళెవరై వుంటారా- భార్యాభర్తలా, ప్రేమికులా, అన్నాచెల్లెళ్ళా, స్నేహితులా- అని షెర్లాక్ హోమ్స్‌లెవల్లో కబుర్లాడుకునే వాళ్ళం అలాంటిది ఈ రోజు అందరూ నన్ను చూసి 'వీడెవడా ఇక్కడ కూచున్నాడు' అని అనుకుంటున్నారనిపిస్తోంది.

సమయం గడుస్తోంది కానీ సుందర్ రాలేదు.టైంబాగా మెయిన్‌టైన్ చెయ్యడం వాడికి అలవాటు. అంతేకాదు. బీచుల్లోనూ, గుళ్ళలోనూ అందమైన అమ్మాయిల్ని చూస్తూ కాలక్షేపం

**●తాను సరిగా వున్నానని సమర్థించుకో వడం కంటే, తననుతాను సరిగా వుంచు కోవడం సరియైనపని.**

చెయ్యడం వాడికి బాగా ఇష్టం. వాడు వస్తే ఆపని చెయ్యచ్చని వాడి కోసం ఎదురుచూస్తూ కూచున్నాను. నలభై ఏళ్ళ నా జీవితం నా కళ్ళ ముందు సినిమారీల్లా కనిపించింది.

ఈ బీచ్‌లో గడిపిన సాయంత్రాలు, మళ్ళీ రావేమో అని ఒక్కసారిగా అనిపించింది.

అవి తిరిగి రావని తెలియక కాదు. తెలుసు.కానీ బలంగా అనిపించడం మాత్రం వేరు.

ప్రకాష్,శ్రీరాం, సుందర్ లేకుండా నేను ఒక్కణ్ణే అక్కడకూచోడంతో ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లుగా అనిపించింది. అదేంటో అర్థంకావడంలేదు- కానీ ఏదో పోయినట్లుగానే ఉంది.

అందుకే అదే సముద్రం,అదే ఆకాశం, అదే ఇసుకా- అంతా కొత్తగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో మార్పొచ్చి మాత్రం కాదు.

సుందర్‌కూడా రాడేమోనని నిరాశగాలేచి అటూ ఇటూ కాస్సేపునడిచి, మళ్ళీ అక్కడకొచ్చాను.

నేను ఖాళీ చేసి వెళ్ళిన చోట ఇంకెవరో ఉన్నారు.

టీన్స్‌లోఉన్న ఓఅందమైన అమ్మాయి-జీన్స్‌లో, టీ షర్ట్‌లో-గుండ్రని మొహంతో, చక్కటి రంగుతో, సన్నగా,నాజూగ్గా ఉంది.

ఆ అమ్మాయి జనం వచ్చే వైపుకి చూస్తూ కూచుంది. ఎవరి కోసమో ఎదురు చూస్తోందిలా వుంది. ఎవరై ఉంటారో. బాయ్‌ఫ్రెండ్ కోసమేమో. ఇంతటి అందగత్తె బాయ్‌ఫ్రెండ్ ఎలాగుంటాడో చూడాలని నాకు కుతూహలం కలిగింది.

నేనూ వచ్చే జనం వైపు చూస్తూ కూచున్నాను- సుందర్ కోసమే కాదు- ఆ అమ్మాయి కోసం ఎవరొస్తారో వాళ్ళ కోసం కూడా.

మధ్య మధ్యన నేను ఆ అమ్మాయిని చూస్తోంటే ఆ అమ్మాయీ నన్ను చూస్తోంది.

నేను చూస్తున్నానని చూడగానే మొహం తిప్పేసుకుంటోంది.ఐతే ఆకళ్ళలో మాత్రం నన్ను చూడాలన్న కోరిక నాకు స్పష్టంగా కనిపించింది.

చీకటి పడుతోంది. సుందర్ రాకపోవచ్చు.ఐనా పరవాలేదు. ఈ అమ్మాయి ఉందిగా అని అనుకుంటుండగా- ఆ అమ్మాయి లేచింది.

వెళ్ళిపోతుందా అని అనుకుంటుండగా- నా వైపు నడుచుకుంటు రాసాగింది.

ఆమె ధోరణి నాకేం అర్థం కాలేదు.

"మీరెవరి కోసమన్నా చూస్తున్నారా?" అని అడిగింది. కంఠం చూడ్డానికే కాదు, వినడానికీ బావుంది.

"లేదు- మీరు- నువ్వు- నువ్వు" అని ఏమనాలో తెలీక నేను ఆగిపోయాను. నా జీవితంలో మొదటిసారి అలా- నేనో అమ్మాయి ముందు మాటలు రాకుండా ఉండిపోవడం.

"నేనో పెద్ద మనిషిని మా ఇంటికి తీసుకుని వెళ్ళాలి-ఆయనకోసంచూస్తున్నాను" ఆ అమ్మాయి నా దగ్గరకి వచ్చి అలా అనడంలో వున్న ఉద్దేశం ఏమిటో నాకు అర్థం కాలేదు.

మనసు రకరకాల ఆలోచనలు చేస్తోంటే-

"మీకూ కంపెనీ లేనట్లుంది- నేనిక్కడ కూచోనా?" అని అడిగింది ఆ అమ్మాయి.

"ఇటీస్ మై ప్లెషర్" అన్నాను నేను.

"మీరు కేలిఫోర్నియా నుండి వస్తున్నారు కదూ?" అని అడిగింది.

నా యాసని బట్టి అమెరికా నుండి అని తెలుసుండచ్చు- కాలిఫోర్నియా అని ఆ అమ్మాయికి ఎలా తెలిసిందో నాకు అర్థంకాలేదు.

అదే అడిగితే నవ్వేసింది. ఆ నవ్వు పదహారేళ్ళ అమ్మాయి నవ్వులా అందంగా వుంది.

"ఏదో పోగొట్టుకున్నట్లు కనిపిస్తున్నారు మీరు"

"అవునేమో" అన్నాను నేను.

"ఏం పోయింది? ఎక్కడ పోయింది?"

"ఏం పోయిందో తెలియదు.పోయింది మాత్రం ఇక్కడే- ఈ బీచ్‌లోనే"

"ఏం పోయిందో చెప్పండి- నేనూ వెతుకుతాను. నన్ను నా ఫ్రెండ్స్ డిటెక్టివ్‌అంటారు.ఎవరివి ఎక్కడ

**వ్యక్తిగా ప్రతివారినీ గౌరవించు. కానీ విగ్రహంగా ఎవరినీ మార్చుకు.**

## స్వపరిచయం



నాలుగున్నర దశాబ్దాల క్రితం మెరీనాతీరంలో జననం. రెండు దశాబ్దాలకి పైగానే- అక్కడే- ఆ తీరంలోనే ఫ్రెండ్స్‌తో ఆడుతూ పాడుతూ చాలా సరదాగా గడిచి పోయింది జీవితం.

ఆకాలంలోనే-కేసరీ హైస్కూల్లో, లయోలా కాలేజీలో, మద్రాసు యూనివర్సిటీలో చదువులూ, డిగ్రీలూ, రేంకులూ. మరో రెండు దశాబ్దాల తర్వాత-అదే తీరంలో ఐ.ఐ.టి. నుండి డాక్టరేట్. రెండున్నర దశాబ్దాలుగా రిజర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగం. ప్రస్తుతం జనరల్ మేనేజర్‌గా- ముంబయిలో అరేబియా సముద్ర తీరాన నివాసం.శ్రీమతిచెప్పే కబుర్లు వింటూండడం, పిల్లలతో కలిసి ఇంటర్మీడియేట్ లెక్కలు చెయ్యడం, అడపాదడపా కథలు రాయడం, ఇష్టంగా చేసే పనులు.

రాసినవి దగ్గర దగ్గర యాభై కథలు. అందులో ఓ పదింటికైనా బహుమతులు వచ్చాయి.ఇప్పుడు స్వాతి నుండి ఈ అనిల్ అవార్డ్ అందుకోవడం చాలా ఆనందంగా వుంది.

E-mail:ramasastri@hotmail.com

అనామకుడు

ఏం కనిపించకపోయినా- నాకు దొరికిపోతాయి'' అంది ఉత్సాహంగా ఆ అమ్మాయి.

"నేను పోగొట్టుకున్నది కనిపించేది కాదు.అసలది ఏంటో నాకు అర్థంకావడంలేదు''

"ఎప్పుడు పోయింది?'' అడిగిందా అమ్మాయి.

"చాలా ఏళ్ళయి వుంటుంది.ఇరవై ఏళ్ళేమో''

"ఇరవై ఏళ్ళక్రితం మీరు పోగొట్టుకున్నది ఇప్పుడు ఇక్కడ వెతుకుతున్నారా'' అంది నన్నో పిచ్చివాడిని చూస్తున్నట్లు.

"ఏం దొరకదా? దొరుకుతుందనే ఆశతో ఇక్కడకి వచ్చాను నేను'' అన్నాను.

"ఇన్నాళ్ళూ ఇక్కడెందుకుంటుంది- ఎవరో ఒకరు తీసేసుకుని ఉంటారు''

"నేనిక్కడ పోగొట్టుకున్నది నా బాల్యం, పూర్తిగా బాల్యం కూడా కాదు- నా కౌమారం- అంటే నా టీన్స్'' అన్నాను నేను.

"నేనిప్పుడు టీన్స్‌లో వున్నాను. అలానే ఇక్కడ చాలామంది వున్నారు. మాలో ఎవరికి దొరికిందో మీరు పోగొట్టుకున్న బాల్యమో,కౌమారమో''అంది.

ఆ అమ్మాయి మామూలుగా అన్న ఆ మాటలు నన్ను బలంగా తాకాయి. అందులో అంతర్లీనంగా నాకు వేదాంతం వినిపించింది.

రస్కిన్ బాండ్ కథ గుర్తుకొచ్చింది.

చిన్నప్పుడు కొందరు స్నేహితులు ఒక నీటి గుంట దగ్గర ఆడుకుంటూ వుంటారు. పెద్దయ్యాక అదే గుంట దగ్గర వాళ్ళకి ఇంకెవరో చిన్న పిల్లలు ఆడుకుంటూ కనిపిస్తారు.

ఓ మనిషి ఓ దశని పోగొట్టుకుంటే- ఇంకెవరో ఆ దశలోకి వస్తారు- రావాలి.

ఎంత లోతైన జీవిత సారాన్ని ఎంత అమాయకంగా చెప్పింది ఆ అమ్మాయి.

"రండి మా ఇంటికి వెళ్దాం'' అంది.

ఎందుకుఅనిఅడక్కుండాబయల్దేరాను.

వాళ్ళింటికి వెళ్ళడానికి ఆటోఎక్కాం.

పక్కపక్కన కూచున్నాం. అలా కూచుందుకు ఆ అమ్మాయి ఏమీ సంకోచపడలేదు.

కుదుపులకి ఒకరికి ఒకరం తగిలినప్పుడు కూడా ఆ అమ్మాయికి ఏమీ అనిపించలేదు.

బాల్యం... అమాయకత్వం... నమ్మకం. నాలో పోయినవి ఆ అమ్మాయిలో పోలేదు.

గూళ్ళలా ఉన్న ఫ్లాట్స్ దగ్గర ఆ అమ్మాయి ఆటో ఆపించింది. వాళ్ళ ఫ్లాట్ పొందికగా బావుంది. లోపలికి వెళ్ళి సోఫాలో కూచున్నాను. లోపల్నుండి సుందర్ వచ్చాడు. ఆశ్చర్యపోయాను.

"నేను రాలేకపోయాను- అందుకే అమ్మాయిని పంపాను'' అన్నాడు సుందర్.

"అంకుల్‌కి నేనెవరో తెలియదు. సర్ప్రైజ్ చేద్దామని వివరాలేవీ చెప్పకుండా మనింటికి తీసుకుని

● నిర్భయం, సహనం, ఉత్సాహం - ఈ మూడు మనిషిని నిత్య సంతుష్టుడిని చేస్తాయి.
● భయమనేది, చేసిన నేరానికి మనం చెల్లించే ప్రతిఫలం, నేరం చేయనివాడు భయపడనక్కర్లేదు.

చ్చాను" అంది ఆ అమ్మాయి.

సుందర్‌కి కాస్త జుట్టు నెరిసింది. గోల్డ్‌రిం కళ్ళద్దాలతో, కాస్త వయస్సు వచ్చినట్లుగా కనిపిస్తున్నాడు కానీ బాగా హుందాగా ఉన్నాడు.

నా పక్కనే కూచుని, నా చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. అంతకు ముందులా కాదు.

అప్పుడు ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ చాలా సరదాగా దూకుడుగా వుండేవాడు.

"ఎలాగుంది బీచ్?" అని అడిగాడు.

"అక్కడ కూచుంటే ఏదో విలువయినది పోగొట్టుకున్నట్లు అనిపించింది. నా జీవితంలో ఇంత వరకూ ఎప్పుడూ అలా అనిపించలేదు.నువ్వు అప్పుడప్పుడు వెళ్తూవుంటావుకదా-నీకలాఎప్పుడైనా అనిపించిందా?" అని అడిగాను నేను.

"జీవితమే అంత కదా- ఏదో పోతుంది- ఇంకేదో వస్తుంది. ఓ దశ నుండి ఇంకో దశకి ఎదుగుతూ ఉంటాం" అన్నాడు సుందర్.

"అందులో ఉన్న అందం, ఆనందం..."అంటూ నేను ఏమనాలో తెలియక ఆగిపోయాను.

"అవును. అవి పోయాయి. అయితే వేరేవి వచ్చాయి" అన్నాడు సుందర్.

"వచ్చాయా? ఏం వచ్చాయి?"

"మనం టీనేజ్‌లో జీవితాన్ని ఒకలా గడిపాం.ఆ అనుభవాలు అప్పుడు అందంగా కనిపించీ ఆనందాన్నిచ్చాయి. ఇప్పుడు వయస్సు పెరిగింది. వాటిని తియ్యని జ్ఞాపకాల్లా మనసు పొరల్లో ఉంచుకోవాలి కానీ-మళ్ళీ అవే కావాలనుకుంటే ఎలా?

చిన్నప్పుడు పిల్లలు బొమ్మలతో ఆడుకునీ, చాక్లెట్లు తినీ ఆనందిస్తారు.పెద్దయిన తర్వాతకూడా అంతేనా! మనంమారుతాం.ఆనందపడేవిషయాలు కాలానుగుణంగా మారుతాయి"

"ఇప్పుడు నువ్వు ఆనందపడే విషయాలు ఏమున్నాయి?" అని అడిగాను.

"అబ్బాయిని చెస్ క్లాస్‌కి తీసుకెళ్ళడం- అమ్మాయికి లెక్కలు నేర్పించడం, శ్రీమతికి వంటింట్లో సాయం చెయ్యడం, కుటుంబంతో బీచ్‌కి వెళ్ళడం..." అంటూ చెప్పడం ఆపాడు సుందర్.

ఒక్క నిమిషం వాడు జోక్ చేస్తున్నాడేమో అని చూశాను. కాదు. వాడు సీరియస్‌గానే చెప్తున్నాడు.

"చెల్లికి మంచి వరుడ్ని చూసి పెళ్ళి చెయ్యడం, అమ్మని ఆస్పత్రికి తీసుకువెళ్ళడం, నీకు తెలియదు రాజా-ఆనందం స్వేచ్ఛలోనే ఉందనుకుంటాం. అయితే అది బంధంలోనూ వుంటుంది. ఏ బాధ్యతా తీసుకోకుండా జీవితాన్ని విలాసంగా గడిపెయ్యడంలోఆనందం ఎంతవుందో తెలియదుకానీ బాధ్యతలోమాత్రం చాలా ఆనందంఉంది"

"బాధ్యతలో ఆనందమా?"

"నన్నడిగితేఓవయస్సొచ్చాకబాధ్యతలోనే ఆనందంవుంటుంది.టీనేజ్‌లోజల్సాగాఉండడంలో ఆనందంవుంది. అప్పుడు అది అనుభవించాం. ఇప్పుడు ఇందులో ఆనందం అనుభవిస్తున్నాం. అనుభవించాలి కూడా" అన్నాడు సుందర్.

ఓ వయస్సు వచ్చాక బాధ్యత తీసుకోవడంలోనే అందం, ఆనందం ఉంటాయని వాడు చెప్పిన మాటలు నాకు సూటిగాతగిలాయి. ఇందాక-నేను పోగొట్టుకున్న బాల్యం తనలాంటి వాళ్ళకి దొరికి ఉంటుందని ఆ అమ్మాయి అన్న మాటల కన్నా బలంగా గుండెలో నాటుకున్నాయి.

"మీ గురించి ఆయన ఎప్పుడూ చెబుతూ వుంటారుకానీ మిమ్మల్ని కలవడం ఇదే మొదటిసారి. ఎలాఉన్నారుఅన్నయ్యగారూకులాసాగాఉన్నారా" అంటూ సుందర్ శ్రీమతి వస్తోంటే- మియామీబీచ్ ఒడ్డునా, పేరిస్ నైట్ క్లబ్బులో-ఎక్కడా కనిపించని- ఓ నిండుతనం, ఓ సంపూర్ణత్వం కదిలి వస్తున్నట్లు అనిపించింది నాకు.

◇◇

**తటస్థంగా వుండేవారికి ఎవరివల్లా ఇబ్బందులు కలగవు.**